క్లుప్తంగా

చుక్కలనంటిన పండ్ల ధరలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పండ్ల ధరలు చుక్కలనంటాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టడం ఆనవాయితీ. ఉపవాస దీక్షలు వదిలేసి సాయంత్రం పండ్లు మాత్రమే తీసుకుంటారు. పండ్లు తప్పనిసరి కావడంతో ప్రతి ఒక్కరూ పండ్లు కొనుగోలు చేయడానికి పండ్ల దుకాణాల వద్దకు రాగా ధరలు మండిపోతున్నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. అరటి పండ్లు మునుపెన్నడూ లేని విధంగా రూ.100 నుంచి రూ.120, పుచ్చకాయ కిలో రూ.40 , ద్రాక్ష కిలో రూ.120, సంత్రాలు కిలో రూ.150, యాపిల్ కిలో రూ. 250, దానిమ్మ కిలో రూ.200, ఖర్జూరం రూ.200 వరకు అమ్ముతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పండ్ల ధరలు మూడు రెట్లు పెరగడంతో భక్తులు ఎక్కువగా కొనలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలయానికి రూ.10వేల విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయానికి ముత్యంపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ ముత్తగారి శిరిష్‌గౌడ్ బుధవారం రూ.10 వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించినట్లు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ అంజయ్య, ధర్మకర్తలు నర్సింలు, లింగారెడ్డి, చిరంజీవి, శేఖర్, ఈవో ప్రభు తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం



బాన్సువాడ: సోమేశ్వర్‌లో చలివేంద్రాన్ని బుధవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రాలు ఉపయోగపడతాయని పోచారం అన్నారు. యువకులు సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం హర్షణీయమని అన్నారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, గులేపల్లి మొగులయ్య, వీరేశం, బీమా గంగారాం, మాణిక్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రపంచవ్యాప్తంగా రోటరీ సేవలు



కామారెడ్డి అర్బన్: విద్య, వైద్య, సమాజ సేవే ధ్యేయంగా ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలు అందిస్తూ మన్ననలు పొందుతుందని రోటరీ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ ఎన్వీ హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక విద్యానగర్‌లోని రోటరీ ఆడిటోరియంలో కామారెడ్డి రోటరీ క్లబ్ 50వ వ్యవస్థాపక దినోత్సవం క్లబ్ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ పూర్వ గవర్నర్ హన్మంత్‌రెడ్డి హాజరై క్లబ్ సేవలను వివరించారు. సేవలు అందించిన 25 మంది ప్రతినిధులను సన్మానించారు. డిప్యూటీ గవర్నర్ ఎ.అశోక్, అసిస్టెంట్ గవర్నర్ జి.జ్ఞానప్రకాష్, క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రామలింగం, బాల్‌రాజ్, రామచంద్రా రెడ్డి, ధనుంజయ, కంకణాల కిషన్, సుభాష్ చంద్ జైన్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



దోమకొండ: దోమకొండ గడికోటలో మహాశివరాత్రి సందర్భంగా గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు శివభక్తి పాటలతో నృత్యాలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వర సురభి థియేటర్ జయచంద్రవర్మ బృందంతో నిర్వహించిన పాతాళభైరవి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. అదేవిధంగా దీపాలతో మహిళలు చేసిన నాట్యాలు ఆకట్టుకున్నాయి. గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ కామినేని శోభన, ట్రస్టు మేనేజర్ బాబ్జీతో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వివిధపార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తాడ్వాయి మండలం కృష్ణాజీవాడిలోని రాజరాజేశ్వరాలయం ఆవరణలో భజనలు



ఎల్లారెడ్డి: శివపార్వతుల కల్యాణంలో భాగంగా స్వామివారి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



మద్నూర్: సోమలింగాల శివాలయంలో..



నిజాంసాగర్: చంద్రమౌళీశ్వరాలయంలో..



కుర్లాలో శివనామ సప్తాహంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

హరహర మహాదేవా.. శంభో శంకర



నస్రుల్లాబాద్: సోమ లింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

శంభో ..శివ శంభో.. ఓం నమ:శివాయ హరహర మహదేవా అంటూ బుధవారం శివ నామస్మరణతో జిల్లాలోని శైవ క్షేత్రాలు మార్మోగాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాల వద్ద జాతరలు వెలిశాయి. పలు చోట్ల భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



కామారెడ్డి పట్టణం జయశంకర్ కాలనీలోని నీలకంఠేశ్వర ఆలయంలో భక్తుల పూజలు



బోర్లం ఆది బసవేశ్వర ఆలయంలో భక్తుల పూజలు



నాగిరెడ్డిపేట: గోలిలింగాల శివారులోని శివాలయంలో భక్తుల సందడి



రాజంపేటలోని రాజరాజేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం



కామారెడ్డిలోని శ్రీచండీ మంత్రాలయంలో..



పెద్దకొడప్‌గల్‌లోని పాపహరేశ్వర ఆలయంలో ..



దోమకొండలోని శివరాంమందిర్ వద్ద భక్తులు



కామారెడ్డిఅర్బన్: ఆర్యసమాజంలో మహా రుద్రయాగం



తిమ్మాపూర్‌లో సంగమేశ్వరాలయంలో పల్లకీసేవ



గాంధారిలో భోగేశ్వరాలయంలో సప్తాహం నిర్వహిస్తున్న భక్తులు



పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



కాచాపూర్‌లో వీరభద్రుడి శోభాయాత్ర



కామారెడ్డిటౌన్: శివకేశవ ఆలయంలో శివపార్వతుల కల్యాణం



శెట్పల్లిలో మల్లికార్జునస్వామి కల్యాణం జరుపుతున్న వేదపండితులు



భిక్కనూరు: సిద్దరామేశ్వరాలయంలో భక్తుల రద్దీ



సిద్దరామేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తూ..



దోమకొండలోని మహదేవుడి ఆలయం వద్ద..



పాల్వంచ మండలం బండరామేశ్వర్‌పల్లిలోని రాజరాజేశ్వర ఆలయంలో..



మాచారెడ్డి: కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



రామారెడ్డి: బుగ్గ రామలింగేశ్వరుని కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

త్రిలింగేశ్వరాలయానికి పూర్వవైభవం తీసుకొస్తా

- ఆలయం గురించి అసెంబ్లీలో ప్రస్తావిస్తా
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వెయ్యేళ్ల చరిత్ర కలిగిన తాండూర్ శివారు త్రిలింగేశ్వరాలయానికి పూర్వవైభవం తీసుకొస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని త్రిలింగేశ్వరాలయంలోని స్వామివారిని బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ తిరిగి ఆలయానికి ఏర్పడ్డ పగుళ్లను పరిశీలించారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల జాబితాలో ప్రస్తుతం త్రిలింగేశవరాలయం పేరు లేదని, పర్యాటక ప్రాంతాల జాబితాలో ఆలయం పేరు ఉండేందుకు అసెంబ్లీలో తాను ప్రస్తావిస్తానని చెప్పారు. ఆలయానికి ఏర్పడ్డ పగుళ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్కియాలజీ నుంచి అనుమతులను తీసుకువస్తానని చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, ఆలయకమిటీ చైర్మన్ దత్తు, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి తదితరులున్నారు.

నీలకంఠేశ్వరాలయంలో పూజలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నేతలు విద్యాసాగర్, తిరుపతి, అశోక్ తదితరులున్నారు.

పంపుసెట్ల ఫ్యూజుల తొలగింపుపై ఆందోళన



ప్రధాన కాలువలో వేసిన పంపుసెట్

బాన్సువాడ రూరల్: మండలంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో వేసిన రైతుల పంపుసెట్లకు సంబంధించిన ఫ్యూజులను అధికారులు తొలగించారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆయకట్టు కింద కాకుండా మరోవైపు అటవీప్రాంతం వైపు పంటలు సాగు చేస్తున్న క్రిష్ణానగర్ తండా, ఇబ్రహీంపేట్ తండా, చిన్న రాంపూర్ వరకు ప్రధాన కాలువ నుంచి చాలా ఏళ్లుగా సాగునీరు వినియోగించుకుంటున్నారు. బుధవారం అధికారులు ఫ్యూజులు తొలగించడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో అధికారులు ఇలా చేయడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై నీటిపారుదల శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.



తొలగించిన ఫ్యూజులు

నేడు కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలోని రాజరాజేశ్వర ఆలయం, దుర్కిలోని సోమేశ్వర ఆలయంలో గురువారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల నుంచి మల్ల యోధులు వస్తున్నట్లు పేర్కొన్నారు. కుస్తీ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

మోడల్ స్కూల్ దరఖాస్తు గడువు పెంపు

బాన్సువాడ రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తు గడువు పెంచినట్లు మండలంలోని కొత్తాబాది మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కమల్ కిషోర్ బుధవారం తెలిపారు. గతంలో ఫిబ్రవరి 28వరకు ఉన్న గడువును మార్చి 10 వరకు ప్రభుత్వం గడువు పెంచిందన్నారు.

ఓసీ అభ్యర్థులు రూ.200, ఇతర వర్గాల వారు రూ.125 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో పూర్తి 100 సీట్లతో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో పరిమిత సంఖ్యలో బ్యాక్‌లాగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



బాన్సువాడ/పెద్దకొడప్‌గల్/మద్నూర్: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బాన్సువాడ, పెద్దకొడప్‌గల్, మద్నూర్ మండలాల పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. గురువారం నిర్వహించే ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అందించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలని పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



తాడ్వాయిలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ప్రభాకర్ బుధవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రెండు పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలకు వేర్వేరుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎల్లారెడ్డి మండలంలో పట్టభద్రుల ఓట్లు 827 ఉండగా వీటిలో పురుషులు 604, మహిళలు 223 ఉన్నారని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 81 ఓట్లు ఉండగా 45 మంది పురుషులు, 36 మంది మహిళలు ఉన్నారని అన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ ప్రొసిడింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఎల్లారెడ్డిలో బస్సు దిగుతున్న పోలింగ్ సిబ్బంది